సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



విద్యార్థిపై దాడిపై విచారణ

తంబళ్లపల్లి నియోజకవర్గం గట్టు గ్రామ పంచాయతీ గట్ల వద్ద ఏర్పాటైన రిషీ వాటిక గురుకుల పాఠశాలలో విద్యార్థిపై జరిగిన దాడిపై పోలీసులు విచారణ చేపట్టారు. -8లో



కూలిన బతుకులు

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు.. బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. ఊరిలో జాతర చూసి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో మృత్యువు వారిని కబళించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 158 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	511	511
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 70.500 కిలోలు



న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



నాగరత్నమ్మ

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 డిప్యూటీ డైరెక్టర్‌గా నాగరత్నమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామ గిడ్డయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ వనిషా, రవి, మానస తదితరులు నాగరత్నమ్మను అభినందించారు.

అంగన్‌వాడీల సమస్యలపై 13న మహాధర్నా



మాట్లాడుతున్న రామాంజులు

రాయచోటి అర్బన్: గత నాలుగు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు, కూరగాయల బిల్లులతో పాటు రెండు మాసాలుగా జీతాలు అందలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు పేర్కొన్నారు. సోమవారం ఆయన రాయచోటిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని అధికారులు చేతులెత్తేయడంతో ఈ నెల 13వ తేదీన మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ప్రతి సెంటర్‌కు దాదాపు రూ.50 నుంచి 60వేల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. శనివారం లోగా పెండింగ్ బిల్లులు చెల్లించి , జీతాలు కూడా విడుదల చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుమలత, విజయమ్మ, సురేఖ, భూదేవి, శంకరమ్మ, పద్మజ, షబాన, కళావతి, పీరమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాలి, వానకు దెబ్బతిన్న వరిపంట



లింగంపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి

సిద్దవటం: మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లి, కడప యాపల్లి, లింగంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిపంట ఆదివారం రాత్రి వీచిన గాలులకు దెబ్బతింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వంద ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. రైతులు జూన్ నెల చివరి వారంలో వరి సాగు చేశారు. ఎకరా పంటకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ఈ నెల చివరిలో పంటను కోయాల్సిన సమయంలో గాలి, వానలకు నేలకొరిగి దెబ్బతింది. గతంలో పంట నష్టానికి ప్రభుత్వం బీమా కల్పించేదని, అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

లక్కిరెడ్డిపల్లి/రామాపురం: స్మార్ట్ పోలీసింగుతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి సర్కిల్ పరిధిలోని రామాపురం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, బాధితుల పట్ల ఆప్యాయంగా, ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. రామాపురం పరిధిలోని గువ్వలచెరువు ఘాటు రోడ్లలో జరిగే ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలలపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా గప్ చుప్!



- నకిలీ మద్యం వ్యవహారంతో మూతపడిన బెల్ట్ షాపులు
- నిల్వల కోసం కొనసాగుతున్న ఎక్సైజ్ పోలీసుల సెర్చ్ ఆపరేషన్
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిపై సస్పెన్షన్ వేటుతో పార్టీలో ప్రకంపనలు



ములకలచెరువులో నకిలీమద్యం తయారీ కేంద్రం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం వ్యవహారం టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.ఎక్కడికక్కడ జిల్లాలో ఉన్న బెల్ట్‌షాపులు మూతపడుతున్నాయి. తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతంలోని బెల్ట్‌షాపులు ఇప్పటికే మూసివేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఎక్కడా నిర్వహించకుండా ఎక్సైజ్‌శాఖతో పనిలేకుండా పోలీసుశాఖ రంగంలోకి దిగడంతో అంతా గప్‌చుప్‌గా మారింది. ఇప్పటికే నకిలీ మద్యం వ్యవహారం ఒక్క అన్నమయ్య జిల్లాలోనే కాకుండా విజయవాడ పరిధిలోని ఇబ్రహీంపట్నంలో బట్టబయలు కావడంతో మద్యం ప్రియుల్లో ఆందోళన నెలకొంది. అయితే గత కొన్నినెలలుగా బెల్ట్‌షాపులకు యథేచ్ఛగా సరఫరా జరిగిన నేపథ్యంలో ఇప్పటికే రోజుల తరబడి సేవించిన వారి పరిస్థితి ఏమిటన్నది అర్థం కావడం లేదు.

టీడీపీలో నకిలీ మద్యం ప్రకంపనలు

జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో నకిలీ మద్యం వ్యవహారం టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న జయచంద్రారెడ్డితో పాటు కేసులో దొరికిన సురేంద్రనాయుడులను పార్టీ సస్పెండ్ చేసింది. ప్రభుత్వం తరుపున చంద్రబాబు సీరియస్‌గా ఉన్నాడని మెసెజ్ ఇస్తూనే మరో వైపు కేసుల విషయంలో పార్టీ కీలక నేతలు లేకుండా లోలోపల వ్యవహారాలను నడుపుతున్నట్లు ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. జయచంద్రారెడ్డిపై అధిష్టానం చర్యలకు ఉపక్రమించడంతో మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు లోలోపల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్న దృష్ట్యా ఈ వ్యవహారం ప్రత్యర్థి వర్గానికి అవకాశంగా మారింది.

పోలీసుశాఖ అప్రమత్తం

జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారం కలకలం రేపుతున్న తరుణంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ ధీరజ్ ప్రత్యేకంగా ఎక్కడికక్కడ ఉన్న బెల్ట్‌షాపులు మూతవేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అన్నిచోట్ల మూతపడుతున్నాయి. మరోవైపు మద్యానికి సంబంధించి ఎలాంటి అక్రమ వ్యవహారాలు సాగినా చర్యలు తప్పవని ఇప్పటికే పోలీసుశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ఒక్క తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతాల్లోనే కాకుండా రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు ఇలా అన్నిచోట్ల బెల్ట్‌షాపులపై చర్యలు చేపడుతున్నారు. దీంతో తమకెందుకులే సమస్య అంటూ బెల్ట్‌షాపుల నిర్వాహకులు మూత వేస్తున్నారు.

ఎక్సైజ్‌శాఖ సెర్చ్ ఆపరేషన్



జిల్లాలో ఎక్సైజ్‌శాఖ సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తోంది. అందిన రహస్య సమాచారం మేరకు సోమవారం కురబలకోట మండలంలో దాడులు చేపట్టారు. మిగతా చోట్ల కూడా ఎక్కడికక్కడ నిల్వల కోసం కొండలు, గుట్టలు, తోటలు ఇలా అన్ని ప్రాంతాల్లో ఆపరేషన్ కొనసాగుతోంది. మొత్తం మీద నకిలీ మద్యం వ్యవహారం ఒక వైపు కేసులు, మరోవైపు నేతల సస్పెన్షన్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీడీపీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయో అన్న అంశం పార్టీ వర్గాలను వెంటాడుతోంది.

» బెల్ట్‌షాపు నిర్వాహకుల్లో వణుకు

జిల్లాలో నాలుగు రోజుల కిందట ములకల చెరువు సమీపంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు సురేంద్రనాయుడుతోపాటు మరికొంతమంది కీలక నేతలు ప్రత్యేకంగా నకిలీ మద్యం తయారు చేసిన వ్యవహారాన్ని ఎక్సైజ్ పోలీసులు మట్టికరిపించారు. అయితే తయారీ కేంద్రం నుంచి మదనపల్లె, తంబళ్లపల్లెతోపాటు సుమారు 75–80 బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం సరఫరా చేసినట్లు ఎక్సైజ్‌శాఖకు దొరికిన డైరీలో నిక్షిప్తమై ఉంది. ఈ పరిస్థితుల్లో బెల్ట్‌షాపు నిర్వాహకులు ముందుకు పోతే నుయ్యి..వెనక్కిపోతే గొయ్యి అన్నచందాన వణికిపోతున్నారు. ఎందుకంటే వారు ప్రజలకు విక్రయించింది నకిలీ మద్యం కావడంతో ఇప్పుడు మద్యం ప్రియుల నుంచి కూడా తిరుగుబాటు ఎదురవుతుందన్న భయం వెంటాడుతోంది.



కేసుల్లో ఇరుక్కుమంటామనే ఆందోళన కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తంబళ్లపల్లె పరిధిలోని రెండు వైన్‌షాపులను సీజ్ చేసిన అధికారులు ఇంకా ఎక్కడైనా మద్యం షాపులకు నకిలీ మద్యం సరఫరా జరిగిందా అన్న కోణంలో కూడా విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ అధికారులకు దొరికిన జాబితా ప్రకారం విచారణ చేస్తుండడంతో బెల్ట్‌షాపులు నిర్వాహకులు దిక్కుతోచక బెంబేలెత్తిపోతున్నారు. నాలుగు రోజులుగా బెల్ట్‌షాపులను ఎక్కడికక్కడ మూతవేసినా ఎప్పుడు ఎలాంటి సమాచారంతో ఫోన్ వస్తుందన్న ఆందోళనతో ఆందోళన చెందుతున్నారు.

నిందితుల కోసం వేట

- నాలుగు బృందాలతో ప్రత్యేక నిఘా

మదనపల్లె: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీమద్యం తయారీ రాకెట్ కేసులో నిందితులైన నలుగురి అరెస్ట్ కోసం నాలుగ బృందాలు వేట సాగిస్తున్నాయి. గత శుక్రవారం బట్టబయలైన నకిలీమద్యం తయారీ రాకెట్‌తో రాష్ట్రం ఉలికిపాటుకు గురైంది. కేసులో ప్రధాన నిందితుడైన ఇబ్రహీంపట్నంకు చెందిన అద్దేపల్లె జనార్దనరావు అరెస్ట్ విషయంలో జాప్యం అయ్యే పరిస్థితులు కనిపిస్తుండగా మిగిలిన ముగ్గురు నిందితుల్లో జయచంద్రారెడ్డి పీఏ రాజేష్, తెనాలికి చెందిన కొడాలి శ్రీ నివాసరావు,ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టారాజులు ఉన్నారు. జనార్దనరావు తాను విదేశాల్లో ఉన్నానని సోమవారం వీడియో సందేశం పంపినా అందులో ఏ దేశంలో ఉన్నది చెప్పలేదు.

లావాదేవీలపై ఆరా

పీఏ రాజేష్‌కు మద్యం దుకాణం కోసం టెండర్లు దాఖలు చేయడం, దుకాణం నిర్వహణ, వ్యాన్ కొనుగోలు తదితర వాటి కోసం వ్యయంచేసేంత ఆర్థిక స్తోమత లేదని గుర్తించారు. దీంతో అతనికి ఆర్థిక వనరులు ఎవరు సమకూర్చారు, ఎక్కడి నుంచి వచ్చాయి అన్న అంశాలను సమగ్రంగా విచారించి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా అతని బ్యాంకు ఖాతాలకు సంబంధించిన లావాదేవీలను పరిశీలించినట్టు సమాచారం. అతని భార్య బ్యాంకు ఉద్యోగినిగా గుర్తించినట్టు తెలిసింది. ముఖ్యంగా పీఏగా ఉంటున్న రాజేష్‌కు అన్ని వ్యవహారాలు తెలిసి ఉంటాయని భావిస్తున్నారు. కేసులో కీలక విషయాలను వెలుగులోకి రావడానికి ఐదో నిందితుడైన రాజేష్ ముఖ్యమని అంటున్నారు.

- ఇబ్రహీంపట్నంకు చెందిన కట్టారాజు ఈ కేసులో రెండో నిందితునిగా, తెనాలికి చెందిన కొడాలి శ్రీనివాసరావు 12వ నిందితునిగా ఉన్నాడు. వీరిని ఎక్సైజ్ బృందాలు అదుపులోకి తీసుకున్నారని సోమవారం ప్రచారం జరగ్గా దొరకలేదని ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. నకిలీమద్యం తయారీ కేంద్రం భవనం లీజు శ్రీనివాసరావు పేరుతో ఉంది. దీంతో ఈ లీజును ఎవరి నుంచి పొందారు, ఎవరు చేయించారన్న కోణంలో వివరాలను సేకరించనున్నారు. కట్టారాజు పాత్ర కూడా కీలకమని చెబుతున్నారు.

నకిలీ మద్యంలో చినబాబు..పెదబాబు ప్రమేయం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి ఆర్సీ ఈశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురబలకోట: ములకలచెరువులో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీలో చినబాబు (నారా లోకేష్), పెదబాబు (నారా చంద్రబాబు) ప్రమేయం ఉందని, లేదంటే ఇంత ధైర్యంగా హైవే పక్కన నకిలీ మద్యం తయారు చేయడం అంత సులభం కాదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, అంగళ్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డి ఆరోపించారు. కురబలకోట మండలంలోని కనసానివారిపల్లెలో పార్టీ నాయకులతో కలసి సోమవారం విలేకరుతో వారు మాట్లాడుతూ జగన్ సీఎంగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన ప్రభుత్వ దుకాణాల వ్యవస్థకు మంగళం పాడి ప్రైవేట్ వారికి మద్యం షాపులు కేటాయించినప్పుడే చంద్రబాబు బుద్ధి బయటపడిందన్నారు. నకిలీ మద్యం తయారీ విక్రయాల వెనుక రాష్ట్ర స్థాయి పెద్దల ప్రమేయం ఉందన్నారు. మరో వైపు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కూడా భారీగా నకిలీ మద్యం రాకెట్ తాజాగా బయటపడిందన్నారు. ఇది కూడా ములకలచెరువు తరహాలో ఉండడంతో ఇలాంటి యూనిట్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండవచ్చనడానికి బలాన్ని చేకూర్చుతోందన్నారు. దీన్ని బట్టి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని చెప్పవచ్చన్నారు. సమగ్ర విచారణ జరిపితే పెద్ద కుంభకోణమే బయటపడుతుందన్నారు. రాష్ట్ర పెద్దల బండారం తెలిసి రాగలదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని అక్రమంగా మద్యం కేసులో అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఆ పాపం నకిలీ మద్యంతో కూటమి ప్రభుత్వాన్ని వెంటాడుతోందన్నారు. తంబళ్లపల్లె నియోజక వర్గానికి కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం మరక అంటించిందడం విచారకరమన్నారు. రాయలసీమ కరువును పారదోలడానికి ఫ్యాక్టరీలు రప్పిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చెప్పారన్నారు. ప్రజలు నమ్మి గెలిపిస్తే చివరకు నకిలీ మద్యం ఫ్యాక్టరీలకు తెరలేపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. నకిలీ మద్యం కేసులో పెద్దల బాగోతాన్ని బయటపెట్టకపోతే వైఎస్సార్ సీపీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు కూడా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

- తంబళ్లపల్లె నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి డి. జయచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గానికి చదువుకున్న వ్యక్తిగా ఫ్యాక్టరీలు రప్పిస్తామని చెప్పారని, చివరకు నకిలీ మద్యం ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించి జనాల చెవిలో పూలు పెట్టారని అన్నారు. నకిలీ మద్యం తయారు చేస్తున్నా ఎక్సైజ్, పోలీస్ శాఖలు పసిగట్టలేక పోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొట్టడమేనన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై ప్రశ్నించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంజీ భూదేవి, వైస్ ఎంపీపీ ఎస్‌వి. రమణారెడ్డి, మండల కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, మహిళా నాయకురాలు రెడ్డి కుమారి, సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి, నక్కా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి: పీజీఆర్ఎస్ ద్వారా అందే ప్రతి అర్జీని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. కావున అధికారులు ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

- వ్యవసాయ అనుబంధ రంగాల పనిముట్లపై జీఎస్టీ తగ్గింపును రైతులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటిలోని మార్కెట్ యార్డులో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, బయో పెస్టిసైడ్స్ తదితర వస్తువులపై జీఎస్టీ 2.0 అమలు అనంతరం రైతులకు చేకూరే లబ్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపుపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పాత రేట్లు, కొత్తరేట్లు తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్ రెడ్డి, రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఎ రాంప్రసాద్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివ నారాయణ, జిల్లా ఉద్యానవన అధికారిణి సుభాషిణి, పశు సంవర్ధకశాఖ డీడీ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రాజంపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా భక్తులు గిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా బహుదానదికి గంగా హారతి ఇచ్చారు. అనంతరం కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చారు. భక్తులు పల్లకిని లాగుతూ.. భక్తి పాటలు పాడుతూ..శివనామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం రాజంపేటకు వచ్చే భక్తులకు చెర్రీస్ స్కూల్ యజమాన్యం వారు బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు సిద్దా లింగారెడ్డి, కార్యదర్శి పోకల ప్రభాకర్, కోశాధికారి వై నందకిషోర్‌గౌడ్, కమిటీ సభ్యులు యుపీరాయుడు, బాలక్రిష్ణారెడ్డి, రాఘవరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

రాయచోటి: ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసులు జవాబుదారీతనంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పోలీసులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా నలుమూలల నుండి వచ్చి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి చర్చించారు. కుటుంబ కలహాలు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు వంటి అనేక అంశాలపై ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీలు వాస్తవాలుగా తేలితే చట్టపరిధిలో తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

గౌరవ వేదన!

- ముస్లింలపై కూటమి సర్కారు చిన్నచూపు
- ఇమామ్, మౌజన్లకు అందని గౌరవ వేతనాలు
- 11 నెలలుగా చెల్లించని సర్కారు



జిల్లాలోని మసీదులు: 380

ఇమామ్‌లు, మౌజాన్లు: 760 మంది

మదనపల్లె సిటీ: మైనార్టీల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించింది. ముస్లింలను భక్తిమార్గంలో నడిపే ఇమామ్‌లు, మౌజన్లకు భక్తి లేకుండా చేస్తోంది. గౌరవ వేతనం కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోంది. దాదాపు 11 నెలలుగా గౌరవవేతనం చెల్లించడం లేదు. మసీదు నిర్వహణ నిధులు మాటే మర్చిపోయింది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని మసీదులకు సొంతంగా ఆదాయం ఉండదు. వాటిని నిర్వహించే ఇమామ్‌లు, మౌజన్లు ప్రతి నెలా ప్రభుత్వమిచ్చే గౌరవ వేతనాలపైనే ఆధారపడతారు.

కూటమి కక్ష సాధింపు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి వరకు ఇచ్చిన వేతనాన్ని రెట్టింపు చేసి, ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలు చొప్పున ప్రతి నెలా పంపిణీ చేసేవారు. 2024 ఎన్నికల నోటిఫికేషన్‌తో కోడ్ అడ్డురాగా అప్పట్లో 3 నెలల గౌరవ వేతనం పెండింగ్‌లో పడింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందరు ఒత్తిడి చేయడంతో ఇప్పటి దాకా ఆరు నెలలు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చి చేతులు దులుపుకుంది. ముస్లింలపై నిర్లక్ష్య వైఖరిని అవలంబించే కూటమి నాయకులు, 11 నెలలుగా గౌరవ వేతనం మంజూరు చేయడం లేదు. దీంతో వారు ఆర్థికంగా నలిగిపోతున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి ఉండగా ఎప్పుడూ ఇలాంటి ఇబ్బంది తలెత్తలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని వాపోతున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తుంటే ..దాదాపు 11 నెలల నుంచి గౌరవవేతనం బకాయిలు ఉన్నాయంటే మసీదుల విషయంలో వారికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. చిన్న కార్యక్రమాలకు రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తుండగా మసీదు నిర్వహణ మాత్రం భారంగా మారడం దారుణం. షాదీ తోఫా పేరుతో రూ.లక్ష ఇస్తామన్న హామీని కూడా తుంగలో తొక్కారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు, కలకడ, కలికిరి తదితర ప్రాంతాల్లో సుమారు 380 మసీదులు ఉండగా సుమారు 760 మంది ఇమామ్‌లు, మౌజాన్‌లు పని చేస్తున్నారు.

» వైఎస్సార్‌సీపీ హయంలో...



వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని వర్గాలతో పాటు ముస్లిం సంక్షేమానికి పెద్దపీట వేశారు. తాను అధికారంలోకి రాగానే ఇమామ్‌లకు, మౌజన్‌లకు రెట్టింపు వేతనం ఇస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా అధికారం చేపట్టగానే ఇమామ్‌లకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచారు. అలాగే ప్రతి నెలా క్రమం తప్పకుండా గౌరవ వేతనం చెల్లించేవారు.

గౌరవవేతనాలు మంజూరు చేయాలి



ఇమామ్‌లు,మౌజన్‌లకు 11 నెలలుగా గౌరవవేతనం మంజూరు చేయకపోవడం దారుణం . కూటమి ప్రభుత్వం తీరుతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం లేని మసీదుల నిర్వహణ కష్టంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు లేవు.తక్షణమే ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనం మంజూరు చేయాలి. –నిస్సార్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మదనపల్లె

క్లుప్తంగా

భార్యపై భర్త దాడి

మదనపల్లి : భార్యపై భర్త దాడి చేసిన ఘటన సోమవారం మదనపల్లిలో జరిగింది. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక శేషప్పతోటలో కాపురం ఉంటున్న కేవీ రమణ భార్య శశికళ (50) గత 20 ఏళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. పిల్లలకు వివాహమై స్థిరపడ్డారు. ఈ క్రమంలో తరచూ కేవీ రమణ భార్య కోసం ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. వారి మధ్య ఏం జరిగిందో కానీ ఉదయం శశికళ వంట చేస్తుండగా భర్త, మరిది దాడి చేసి గాయపరిచారు. బాధితురాలిని స్థానికులు వైద్యం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం



మృతి చెందిన రైతు రఘునాథరెడ్డి

కురబలకోట : మండలంలోని దొమ్మన్నబావి సర్కిల్ వద్ద సోమవారం కారు ఢీకొన్న సంఘటనలో తూగువారిపల్లెకు చెందిన రైతు రఘునాథరెడ్డి (55) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తూగువారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి మరో ఇద్దరితో కలసి మోటార్ సైకిల్‌పై అంగళ్లు వైపు రాసాగాడు. దొమ్మన్నబావి సర్కిల్ వద్ద బైపాస్ మీదుగా వేగంగా వస్తున్న కారు వీరిపైకి ఒక్కసారిగా దూసుకు వచ్చింది. వేగంగా ఢీకొంది. దీంతో రైతుకు తీవ్ర గాయాలై రెప్పపాటులోనే అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెనుక కూర్చుని వస్తున్న మరో ఇద్దరికి గాయాలు కాగా వారు కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

యువకులకు గాయాలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట కట్టాపుట్టాలమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై బొమ్మవరానికి చెందిన వెంకటరమణ, శంకర సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా తిరుపతికి వెళ్తున్న కారు ఢీకొని తీవ్ర గాయాలు పాలయ్యారు. వారిని హుటాహుటిన కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఎస్సై లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘కూలి’న బతుకులు

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు.. బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. దొరికిన పనులతో కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చారు. ఊరిలో జాతర చూసి తిరుగుపయనం మయ్యారు. మార్గంమధ్యలో మృత్యువు వారిని కబళించింది. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



మృతి చెందిన రామాంజులు



కళావతి మృతదేహం



ఢీకొని దెబ్బతిన్న వాహనాలు

- బతుకుదెరువు కోసం వెళ్లి కర్ణాటకలో మృత్యువాత
- రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం
- శోకసంద్రంలో కుటుంబం

రామసముద్రం : అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం ఎర్రబోయినపల్లికి చెందిన దంపతులు కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రబోయినపల్లికి చెందిన రామాంజులు(33), కళావతి(28) దంపతులు బతుకుదెరువు కోసం కర్ణాటక రాష్ట్రం వెళ్లారు. అక్కడ కేఆర్ పురం వద్ద కూలీ పనులు చేసుకుంటుండే వారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం గ్రామంలో అమ్మవారి జాతర ఉండటంతో ఇద్దరు పిల్లలను అక్కడే ఇంటి యజమాని వద్ద వదిలి.. సొంత గ్రామానికి వచ్చారు. జాతర ముగించుకుని సోమవారం ద్విచక్ర వాహనంలో కర్ణాటకకు వెళ్లే నేపథ్యంలో.. కళావతికి ఆరోగ్యం బాగలేకపోవడంతో మదనపల్లికి చేరుకుని చికిత్స చేయించుకుని కర్ణాటకకు బయలుదేరారు. మార్గంమధ్యలోని రాయల్పాడు వద్ద టిటి వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. వారి మృతితో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం శ్రీనివాసపురం ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం

కేసు మాఫీ చేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నం

గుర్రంకొండ : మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం తరిగొండలో చోటుచేసుకుంది. అయితే కేసును మాఫీ చేసేందుకు టీడీపీ నేతలు సోమవారం సాయంకాలం వరకు పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో విశ్వప్రయత్నం చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ మహిళ స్థానిక కృష్ణారెడ్డి వీధిలో నివాసం ఉంటోంది. గత కొంత కాలంగా జీవనోపాధి నిమిత్తం తిరుపతి పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన మానసిక దివ్యాంగురాలు అయిన కుమార్తె (32)తో కలిసి జీవనం సాగిస్తోంది. ఆమె కుమారుడు తరిగొండలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మానసిక దివ్యాంగురాలు తరిగొండలో ఉన్న తన అన్న వద్దకు తిరుపతి నుంచి బయలుదేరింది. ఈ విషయం ఫోన్ ద్వారా ఆమె తల్లి కుమారుడికి తెలియజేసింది. మానసిక దివ్యాంగురాలు తిరుపతి నుంచి వాల్మీకిపురం చేరుకొని అక్కడి నుంచి తరిగొండకు బస్సులో వచ్చింది. గ్రామంలోని సచివాలయం వద్ద నిలుచొని తాను వచ్చానని, వచ్చి తీసుకెళ్లాలని అన్నకు సెల్‌ఫోన్‌లో చెప్పింది. అయితే ఆ ఫోన్‌లో అదే వీధిలో నివాసముంటున్న సయ్యద్ నయాజ్ అలీ(27) అనే యువకుడు మాట్లాడాడు. మీ అన్న పని మీద ఉన్నాడని, తాను వచ్చి తీసుకెళతానని నమ్మబలికాడు. వెంటనే ద్విచక్రవాహనం తీసుకొని నయాజ్‌అలీ అక్కడికి వచ్చాడు. ఆమెను బైక్‌లో ఎక్కించుకొని గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ పక్క వైపు వెళ్లాడు. ఆమెకు అనుమానం రావడంతో తనను ఎక్కడికి తీసుకెళుతున్నావని గట్టిగా నిలదీసింది. దీంతో కంగుతిన్న నయాజ్‌అలీ ద్విచక్రవాహనాన్ని పొదలపక్కన నిలిపి వేసి.. ఆమెను బలవంతంగా పొదల వైపు లాక్కెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. గట్టిగా కేకలు వేసి అతడి చర్యలను ప్రతిఘటించి అక్కడి నుంచి బయట పడింది. జరిగిన సంఘటనను తిరుపతిలో ఉన్న తన తల్లికి తెలియజేసింది. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై సోమవారం గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆమె లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘురామ్ తెలిపారు. అయితే సోమవారం పోలీస్‌స్టేషన్ వద్ద పెద్ద పంచాయితీ జరగడం గమనార్హం. మండలానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు నిందితుడి తరఫున రంగప్రవేశం చేసి కేసును మాఫీ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. చివరకు బాధితులను భయందోళలకు గురి చేసి బలవంతంగా రాజీ చేసేందుకు సాయంకాలం వరకు ప్రయత్నించారు. అయితే వీరి ప్రయత్నాలు ఫలించక పోవడంతో పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.

వైఎస్‌ఆర్ నగర్‌లో గృహాల కూల్చివేత

- ఫోర్జరీ సంతకాలతో అనుబంధ పత్రాలు
- న్యాయం చేయాలని బాధితులు వేడుకోలు



గృహాలను కూల్చివేసిన దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధి వైఎస్‌ఆర్ నగర్ 892/3 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసుకున్న నివాస గృహాలను కొందరు వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం కూల్చివేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు బొడ్డుబోయిన నారాయణ, ఇప్పలపల్లె సుజాత, కోండ్ల పార్వతమ్మ, భోగా లక్ష్మమ్మలు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం 2008లో రెవెన్యూ శాఖ అధికారులు ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున స్థలం మంజూరు చేసి డీ ఫారాలు, అనుబంధ పత్రాలను అందజేశారన్నారు. అందులో తాము గృహాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆయా గృహాలకు మాధవరం గ్రామ పంచాయతీకి పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. గృహాలకు విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోగా అవి కూడా వచ్చాయన్నారు. ఈ క్రమంలో పాటూరు గంగిరెడ్డి, ఎర్రి వెంకటరెడ్డిలు కొందరు బయటి వ్యక్తులను పిలుచుకొని వచ్చి సిద్దవటం పోలీసుల ఆధ్వర్యంలో తాము లేని సమయంలో నూతనంగా నిర్మించుకొన్న గృహాలను కూల్చివేశారన్నారు. అలాగే పాటూరు గంగిరెడ్డి, ఎర్రి వెంకటరెడ్డిలు ఫోర్జరీ సంతకాలతో అనుబంధ పత్రాలను సృష్టించి ఇవి తమ స్థలాలే అని కట్టడాలను కూల్చివేశారన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

డ్రోన్ సాయంతో జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండలంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందించిన సమాచారంతో వారు డ్రోన్ సహాయంతో పేకాట స్థావరాన్ని గుర్తించి సోమవారం దాడులు నిర్వహించారు. నిమ్మనపల్లె ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపిన వివరాలు.. మండలంలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లి సమీపంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచి పోలీసులు గుర్తించారన్నారు. వారు ఇచ్చిన సమాచారంతో జిల్లా ఎస్పీ ధీరజ్‌కనుబిలి, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాలతో పోలీసు బృందంతో కలిసి సోమవారం మధ్యాహ్నం డ్రోన్ సహాయంతో పేకాట స్థావరాన్ని గుర్తించి దాడి చేశామన్నారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో ఆరుగురు నిమ్మనపల్లె మండలానికి చెందిన వారు కాగా మరొకకరు మదనపల్లె మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, రూ.20,850 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కోడిపందాలు, పేకాట స్థావరాలు, బహిరంగ ప్రదేశాలల్లో మద్య సేవించడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ దాడిలో స్పెషల్ బ్రాంచ్ పీసీ కేశవ, డ్రోన్ ఆపరేటర్ అలీ, నిమ్మనపల్లె పోలీసు సిబ్బంది శివ రాజశేఖర్, నరేష్, రాజేష్, ధుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఎమ్మెల్యే పదవిపై ఆసక్తికర చర్చ

- బీఆర్ సురేష్ ఎమ్మెల్యే కావాలన్న శ్రీనివాసులు
- ఎక్కడో పోటీ చేసే ఎమ్మెల్యే నాకొద్దన్న సురేష్



పీకేఎం ముడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సురేష్

మదనపల్లె : స్థానిక పంచాయతీరాజ్ ప్రాంగణంలో సోమవారం పీకేఎం ముడా చైర్మన్ బీఆర్.సురేష్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పదవిపై పరస్పర వ్యాఖ్యలు చర్చకు దారితీసింది. సభలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ ‘బీఆర్ సురేష్ తండ్రి దొరస్వామినాయుడు ఎమ్మెల్యేగా చేశారు, సురేష్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆయనకు ఎమ్మెల్యే కావాలన్న కోరిక ఉంది. అందుకనే ఆయన టీడీపీ రాజకీయాల్లో ఎదిగి ఎమ్మెల్యే కావాలని కోరుకొంటున్నట్లు’ చెప్పడంతో ఎమ్మెల్యేలు, కుప్పం నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు. కుప్పంలో చంద్రబాబు ఉండగా ఆయన స్థానంలో సురేష్ పోటీ చేయాలా అన్న చర్చ మొదలైంది. చివర్లో ప్రసంగించిన బీఆర్.సురేష్ ఎక్కడో (వేరే నియోజకవర్గాలు) వెళ్లి ఎమ్మెల్యే కావాలని లేదని, కుప్పంలోనే ఉండి పార్టీ కోసం పని చేస్తానని చెప్పారు. తనకు ఎమ్మెల్యే పదవిపై ఆశలేదని ప్రకటించి ఉంటే సరిపోయేది, అలా కాకుండా ఎక్కడో వెళ్లి పోటీ చేయలేనని చెప్పడం చూస్తే కుప్పంలో పోటీ చేయాలన్న ఆలోచన ఉందా అంటూ హాజరైన పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఈ సభకు ముందు బీఆర్.సురేష్ పీకేఎం ముడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు యండపల్లె వెంకట్రావ్, షాజహాన్‌బాషా, జగన్‌మోహన్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న బైక్

కడప అర్బన్ : కడప నగర వినాయక నగర్ సర్కిల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కడప ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వల్లూరు మండలం బీచ్ వారిపల్లి గ్రామానికి చెందిన ఇరగబోయిన రామ్మోహన్ (39) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా భార్య, ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. ఉదయం 11:30 గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వినాయక నగర్ జంక్షన్ సమీపానికి రాగానే, రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

రాంగ్ రూట్‌లో వచ్చి లారీని ఢీకొన్న కారు

- తప్పిన పెను ప్రమాదం
- మద్యం మత్తులో కారులోని యువకులు



లారీని ఢీ కొన్న కారు

పుల్లంపేట : ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాంగ్ రూట్‌లో వచ్చి.. లారీని ఢీకొనడంతో.. లారీ వెనుక వైపున నాలుగు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో.. రెండు కార్లలో ఉన్న పది మంది ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాజంపేట నుంచి రైల్వేకోడూరు వైపు వెళ్తూ ఉడుమువారిపల్లి సమీపంలోకి రాగానే రాంగ్ రూట్‌లో ఎదురుగా ఉన్న లారీని ఢీకొన్నారు. ముందుగానే పసిగట్టిన లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో.. కారు పాక్షికంగా దెబ్బతింది. కారులో ఉన్న ముగ్గురు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అయితే లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకవైపున లారీతోపాటు రెండు కార్లు వస్తున్నాయి. అదే సమయంలో వాటి వెనుకే ముగ్గురాయితో మంగంపేట నుంచి కడపకు వెళ్తున్న టిప్పర్ ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు తిప్పడంతో కారు వెనుకవైపు ఓ పక్క ఢీకొంది. దీంతో రెండు కార్లలో ఉన్న పది మంది సురక్షితంగా బయటపడ్డారు. టిప్పర్ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో రెండు కార్లు పాక్షికంగా మాత్రమే దెబ్బతిన్నాయి. ఒక కారులో అయితే ఇద్దరు, తల్లిదండ్రులతోపాటు నలుగురు పిల్లలు కూడా ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మద్యం మత్తులో ఉన్న యువకులను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడి పరిస్థితి విషమంగా మారిన ఘటన సోమవారం పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు. మండలంలోని పోతుపేటకు చెందిన రైతు నారాయణ (70) పొలం వద్దకు రోడ్డుపక్కన నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నారాయణ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నారు.

కుక్క అడ్డుగా రావడంతో..

బైక్‌పై వెళ్తున్న సోదరులు రోడ్డుపై కుక్క అడ్డురావడంతో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు. తంబళ్లపల్లెకు చెందిన అజయ్‌కుమార్ (19), ఆది (17) సొంతపనుల కోసం బైక్‌పై మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలోని ముదివేడు వద్దకు రాగానే కుక్క అడ్డుపడింది. దీనితో బైక్ అదుపుతప్పి పడిపోగా తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యపై భర్త హత్యాయత్నం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన దుంపల వినోద్ కుమార్ తన భార్యను ఆదివారం హత్య చేసేందుకు ప్రయత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ చేస్తున్నట్లు ఎస్సై చిన్న పెద్దయ్య తెలిపారు.

అంతర్ రాష్ట్ర బైక్‌ల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



నిందితుడిని హాజరు పరిచిన డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

మదనపల్లె : అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసినట్లు స్థానిక డీఎస్పీ మహేంద్ర వెల్లడించారు. సోమవారం మదనపల్లె తాలూకా సీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి (33) బైక్‌ల చోరీలకు పాల్పడ్డాడు. అన్నమయ్య, తిరుపతి, కర్ణాటకలోని కోలారు జిల్లాల్లో 25 బైక్‌లను చోరీ చేశాడు. రెండేళ్లలో మదనపల్లె, పీలేరు, కలికిరి, బి.కొత్తకోట, ముదివేడు, పెద్దతిప్పసముద్రం మండలాలు, కోలారు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేశాడు. కర్ణాటకలో చోరీ చేసిన బైక్‌లను ఆంధ్రాలో.. ఆంధ్రాలో చోరీ చేసిన బైక్‌లను కర్ణాటకలో విక్రయిస్తున్నాడు. దీనిపై నమోదైన కేసులతో నిందితునిపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం మదనపల్లె బసినికొండ వద్ద ఓ బైక్‌ను చోరీచేసే ప్రయత్నంలో ఉండగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బైక్‌ల దొంగతనాలు వెలుగులోకి వచ్చాయని, నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ కళా వెంకటరమణ, ఎస్‌ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.


‘ఎర్రచందనం’ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ బీవీ చలపతి

రాయచోటి : ఎర్రచందనం అక్రమ తరలింపు కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌లో సీఐ బీవీ చలపతి సోమవారం వివరాలు వెల్లడించారు. 2021 నవంబర్ 10న రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఎర్రచందనం అక్రమ తరలింపుపై కేసు నమోదైందని తెలిపారు. ఈ కేసులో వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు మండలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొలిమి సుభాన్ బాషా, అర్జున్ నిందితులుగా ఉన్నారన్నారు. నాటి నుంచి పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు రింగ్‌రోడ్డు వద్ద గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన రికార్డులతో తిరుపతిలోని రెడ్ సాండిల్ స్పెషల్ కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వివరించారు.

బెల్ట్‌షాపులో మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం, బీరు బాటిళ్లు

ములకలచెరువు : ఎక్సైజ్ పోలీసుల దాడులు జరుగుతున్నా, నకిలీ మద్యం కేసుతో అలజడి రేగినా బెల్టు షాపుల నిర్వాహకులు మాత్రం యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ములకలచెరువు మండలంలోని బురకాయలకోటలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణంలో నిర్వహిస్తున్న బెల్టుషాపు తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ బీర్లు, మద్యం కలిపి 278 బాటిళ్లు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పరారయ్యాడని ఎక్సైజ్ పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి : జిల్లాలోని దళితవాడల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయచోటి కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ పరిధిలోని అరవీడు గ్రామం, అలకచెరువుకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు రహదారి నిర్మిస్తామని హామీలు ఇస్తూ ఓట్లు వేయించుకొని తరువాత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతి చిన్నయ్య, మద్రి సుమిత్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల్ల మణి, కార్మిక సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడిపై విచారణ

- కంటి చూపు కోల్పోయిన విద్యార్థి
- నిందితులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం
- ఉన్నతాధికారులకు తల్లిదండ్రులు ఫిర్యాదు



విద్యార్థి కంటి నుంచి రక్తస్రావం (ఫైల్)



విచారణ చేస్తున్న మదనపల్లి పోలీసులు

లక్కిరెడ్డిపల్లి : తంబళ్లపల్లి నియోజకవర్గం బి కొత్తపేట సమీపంలోని గట్టు గ్రామ పంచాయతీ గట్ల వద్ద ఏర్పాటైన రిషీ వాటిక గురుకుల పాఠశాలలో విద్యార్థిపై జరిగిన దాడిపై మదనపల్లి-2వ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేట గ్రామ పంచాయతీ కలాడివాండ్లపల్లికి వారు సోమవారం చేరుకుని విద్యార్థి కొండా శేషాద్రిరెడ్డి, వారి కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి శేషాద్రిరెడ్డి తండ్రి అమరనాథరెడ్డి సీఐ రాజారెడ్డికి వివరాలు వెల్లడించారు. వేదవ్యాస్ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే రిషీ వాటిక గురుకులంలో బోధనేతర సిబ్బందిగా పని చేస్తున్న ఆర్.వెంకటేష్ అనే వ్యక్తి విద్యార్థి తండ్రి అమరనాథరెడ్డికి ఒక లక్ష ఫీజు చెల్లించాలంటూ ముందుగా తెలియజేశారు. రెండు రోజులు ఆలస్యం అవ్వడంతో.. విద్యార్థి శేషాద్రిరెడ్డిపై వెంకటేష్ రాయితో కొట్టడంతో కన్నుపై పడి.. కంటి నుంచి రక్తస్రావం అయినట్లు తెలిపారు. విద్యార్థి స్పృహ తప్పి పడిపోవడంతో పాఠశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా సొంత వైద్యం చేయడంతో.. కుడి కన్నులోని రెటినా పూర్తిగా జారిపోయి దెబ్బతిన్నట్లు గమనించి.. తండ్రి అమరనాథరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారన్నారు. హుటాహుటిన తిరుపతిలోని ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ చేయించారన్నారు. తర్వాత స్వగ్రామం అయిన లక్కిరెడ్డిపల్లి మండలం కోనంపేట గ్రామం కాలాడివాళ్లపల్లికి తీసుకొచ్చామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సెప్టెంబర్ 7న విద్యార్థిపై దాడి చేయగా అదే నెల 14న విద్యార్థి శేషాద్రిరెడ్డి, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బి.కొత్తకోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్కడి పోలీసులు ఆ పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై వెంకటేష్‌పై మాత్రమే కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటి వరకు ఆ పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, వెంకటేష్‌ను గానీ అరెస్టు చేయలేదన్నారు. ఈ తంతు ఇలా కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాల యాజమాన్యంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పాటు డీజీపీ, హోం శాఖ సెక్రటరీ, హోం మంత్రి, ఉమెన్ మినిస్ట్రీ సెంట్రల్‌కు ఫోన్ ద్వారా తెలపడంతో పాటు వాట్సాప్ ద్వారా కంప్లెయింట్ ఇవ్వడం, నేషనల్ కమిషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్)కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ ఫిర్యాదును ఏమాత్రం పట్టించుకోకుండా నిందితుడు వెంకటేష్, పాఠశాల యాజమాన్యాన్ని కాపాడేందుకు జిల్లా యంత్రాంగం స్టేట్, సెంట్రల్ వారికి తప్పుడు సమాచారం అందిస్తూ కేసును తప్పుదోవ పట్టిస్తోందని తెలిపారు.

న్యాయం చేయాలి

ఇంతటితో ఈ కేసు వదిలేయకపోతే మీ కుటుంబం మొత్తాన్ని లేపేస్తామని అదే పాఠశాలలో చదువుకునే మరొక విద్యార్థి తండ్రి పాఠశాల తరఫున వంత పాడుతూ కాలాడివాండ్లపల్లికి వచ్చి చెప్పినట్లు తెలిపారు. తన బిడ్డకు జరిగిన అన్యాయం రాష్ట్రంలో ఏ బిడ్డకు జరగకూడదనే ఉద్దేశంతో కేసును ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విచారణ పేరుతో మదనపల్లి నుంచి వచ్చిన సీఐ గోపాల్‌రెడ్డి విద్యార్థి శేషాద్రిరెడ్డిని ఇంట్లో నుంచి బయటికి బలవంతంగా లాక్కెళ్లే ప్రయత్నం చేయగా.. విద్యార్థి భయభ్రాంతులకు గురై కుప్పకూలిపోయినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలను స్థానికులు వీడియోలు తీయడంతో.. చాటుమాటుగా డ్రెస్ మార్చుకునే ప్రయత్నం చేసి అక్కడి నుంచి జారుకున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఆ పాఠశాల యాజమాన్యం, వెంకటేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని విన్నవించారు.